ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాలలో
విజ్ఞాన్ పత్రికకు
విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 9951775293

VIGNAN PATRIKA
APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 33 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి శనివారం 28 ఫిబ్రవరి 2026 పేజీలు : 04 వెల : 02



# ఉద్యాన హబ్‌గా రాయలసీమ

- ఈ ఏడాది చివరికి 10 లక్షల పైగా గృహ ప్రవేశాలు జరిపిస్తాం: అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటన
- ఈ ఏడాది డిసెంబర్ నాటికి 10 లక్షల ఇళ్లు లబ్ధిదారులకు అందజేత
- నిరుపేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం ఉచితం
- రైతు సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయాభివృద్ధికి ఐదు సూత్రాల అమలు
- లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు
- ఏలూరులో ప్రపంచంలోనే అతిపెద్ద కోకో సిటీ ఏర్పాటు
- 2029 నాటికి అందరికీ ఇళ్లు అందిస్తాం
- అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతాం
- వ్యవసాయానికి 'పంచ సూత్రాల' ఊతం

"వ్యవసాయ రంగంలో యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నాం. రైతులకు ఆధునిక పరికరాలను పరిచయం ప్రోత్సహిస్తున్నాం. ఫుడ్ ప్రాసెసింగ్‌పై అధిక దృష్టి పెట్టాం. ప్రకృతి సేద్యాన్ని 50 లక్షల ఎకరాలకు విస్తరిస్తాం. రాయలసీమలో 20 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ సాగు అవుతోంది. దేశంలోనే అత్యధిక పండ్లు పండే ప్రాంతంగా రాయలసీమ ఉంది. రాయలసీమలో హార్టికల్చర్‌ను 40 లక్షల ఎకరాలకు పెంచుతాం. రాయలసీమ హార్టికల్చర్‌కు రూ.లక్ష కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. ఏలూరు దగ్గర అతిపెద్ద కోకో సిటీ వస్తుంది. ఏజెన్సీలో కాఫీ పంట విస్తీర్ణం పెరుగుతోంది. ఆక్వా ఉత్పత్తిలో దేశంలోనే తొలి స్థానంలో ఉన్నాం. అతిపెద్ద ఆక్వా కల్చర్ హబ్‌గా మన రాష్ట్రం తయారవుతుంది." - సీఎం చంద్రబాబు

## 18 ఏళ్లు న్యాయపోరాటం చేశాం

- మాకు న్యాయం జరగలేదు: ఆయేషా మీరా తల్లిదండ్రులు
- తెనాలి ముస్లిం శ్మశానవాటికలో ఆయేషా మీరా అంత్యక్రియలకు ఏర్పాట్లు
- 18 ఏళ్లు పోరాడినా న్యాయం జరగలేదన్న ఆయేషా తల్లిదండ్రులు

'మేము న్యాయం కోసం తిరుగుతుంటే, దోషులు మాత్రం దర్జాగా జల్సాలు చేస్తున్నారు. ఆ దేవుడే దోషులను కఠినంగా శిక్షించాలని వేడుకుంటున్నా. సీబీఐ కూడా ఆయేషా మీరా హత్య కేసులో నిందితుడిని తేల్చలేకపోయింది. మాకు న్యాయం చేయకపోగా అన్యాయం చేశారు. ఆధారాలు లేవని చెప్పి కేసు కొట్టేశారు. ధనికులకు మాత్రమే న్యాయం జరుగుతోందిక్కడ. పేదవారికి న్యాయం జరగటం లేదు.' -ఆయేషా తల్లిదండ్రులు



# ఇక కోర్ అర్బన్ చట్టం

- జీహెచ్‌ఎంసీ చట్టం స్థానంలో తయారు చేయాలని అధికారులకు ఆదేశం
- అన్నింటికీ ఆ చట్టమే ఆధారంగా ఉండాలని సూచన
- కోర్ ఏరియాలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలి
- ఓఆర్ఆర్ లోపల రోడ్లలన్నింటినీ పురపాలక శాఖ పరిధిలోకి తేవాలి
- పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి
- రోడ్ల నిర్మాణంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి
- భవనాల పనులు వేగవంతం చేయాలి



ఔటర్ రింగురోడ్డు పరిధిలోని (కోర్ అర్బన్) మూడు మున్సిపల్ కార్పొరేషన్లకు వర్తించేలా గ్రేటర్ హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ) చట్టం స్థానంలో కోర్ అర్బన్ చట్టాన్ని తయారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## తెలంగాణ ఉద్యోగులకు 'భారీ' ఊరట..!

- రూ. 745 కోట్ల బకాయిలు విడుదల చేసిన ప్రభుత్వం!
- పెండింగ్ బకాయిల విడుదలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ఆదేశాలు
- విడతల వారీగా బకాయిల చెల్లింపు ప్రక్రియ షురూ
- గ్రామ పంచాయతీలకు సైతం రూ. 389 కోట్ల నిధులు
- హామీ నెరవేర్చిన సర్కార్
- పంచాయతీలకూ నిధుల పంపిణీ



## మావోయిస్టు రహిత రాష్ట్రంగా ఆవిర్భవించిన

# తెలంగాణ

- రైతాంగ సాయుధ పోరాటం నుంచి నేటి వరకు ఉద్యమ చరిత్ర ఇదే
- కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ
- ఇప్పటికే వనం వీడి జనంలోకి వచ్చిన ఆ పార్టీ టాప్ లీడర్లు
- తెలంగాణలో పూర్తిగా బలహీనపడిన పార్టీ
- అడవులు, కొండలను కంచుకోటగా మార్చుకుని పోరాటం
- మావోయిస్టులు ఒకానొక దశలో ఉమ్మడి రాష్ట్రంలో పలు గ్రామాల్లో 'జనతన సర్కార్' పేరుతో సమాంతర ప్రభుత్వాలను నడిపారని గుర్తించిన పోలీస్ అధికారులు



తెలంగాణ ప్రాంతంలో విప్లవానికి ఊపిరి పోసిన రైతాంగ సాయుధ పోరాటం, నిజాం కాలం నాటి నుంచి మలి దశలో మావోయిస్టు ఉద్యమ విస్తరణ వరకు ఈ గడ్డపై తుపాకీ గొట్టం వినిపించని రోజు లేదు. కానీ కాలక్రమేణా మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ నేడు మావోయిస్టు రహిత రాష్ట్రంగా ఆవిర్భవించింది. ఉమ్మడి రాష్ట్రంలో వెట్టిచాకిరి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా మొదలైన సాయుధ రైతాంగ పోరాటం, ఈ గడ్డపై విప్లవ బీజాలుగా ఏర్పడింది.

## వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి బొత్సకు బ్రెయిన్ స్ట్రోక్

- హుటాహుటిన హైదరాబాద్‌కు తరలింపు
- కొనసాగుతున్న చికిత్స
- ఆరోగ్యం నిలకడగానే ఉందన్న వైద్యులు
- రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేసే అవకాశముందన్న వైద్యులు



# 'ఇంకెంతమంది ప్రాణాలు పోవాలి'

- ఏపీలో పాలు, నీళ్లు కూడా ప్రాణాంకతమే: జగన్
- చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే వరుస మరణాలని జగన్ ఆరోపణ
- శ్రీకాకుళం, రాజమండ్రి ఘటనలతో డజనుకు పైగా మృతి చెందారని వెల్లడి
- గత 14 నెలల్లో 900 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆవేదన
- ప్రభుత్వం వెంటనే మేల్కొని చర్యలు చేపట్టాలని డిమాండ్
- టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల్లో 25 ఫుడ్ పాయిజన్ ఘటనలు
- ఫుడ్ పాయిజన్ ఘటన వల్ల 15 జిల్లాల్లో 900 మందికి పైగా విద్యార్థులు అస్వస్థత
- కురుపాం గిరిజన బాలికల పాఠశాలలో తాజాగా 16 మంది విద్యార్థినులు డయేరియాతో అస్వస్థత
- రాజకీయ ప్రయోజనాలు పక్కనపెట్టి చిత్తశుద్ధితో పరిస్థితిని సమీక్షించాలని జగన్ డిమాండ్
- శ్రీకాకుళంలో కలుషిత నీటి కారణంగా డయేరియాతో ఐదుగురు మరణించగా, 200 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారని గుర్తు చేసిన మాజీ సిఎం వై యస్ జగన్



# ఉద్యాన హబ్‌గా రాయలసీమ

రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సొంతింటి కలను నిజం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈ దిశగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నేడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గృహ నిర్మాణం, వ్యవసాయ శాఖల పద్దులపై జరిగిన చర్చలో సీఎం ప్రసంగించారు. ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 10 లక్షలకు పైగా ఇళ్లకు గృహ ప్రవేశాలు జరిపిస్తామని ఆయన సభలో ప్రకటించారు. ఇప్పటికీ ఇళ్లు లేని నిరుపేదలు ఎవరైనా ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**2029 నాటికి అందరికీ ఇళ్లు**

రాష్ట్రంలో ఏ ఒక్క పేద కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే తమ ధ్యేయమని సీఎం తెలిపారు. రాయచోటి నుంచి ఇప్పటికే 3 లక్షల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించామని, ఈ ఏడాది ఉగాది నాటికి దాదాపు 3 లక్షల ఇళ్లలో లబ్ధిదారులు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జూన్ నాటికి మరో 2.26 లక్షలు, సెప్టెంబర్ నాటికి ఇంకో 2.10 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు పూర్తి చేస్తామని స్పష్టమైన ప్రణాళికను వివరించారు. 2029 నాటికి రాష్ట్రంలోని పేదలందరికీ పక్కా ఇళ్లు కట్టించడంతో పాటు, అర్హులైన వారికి ఉచితంగా ఇంటి స్థలాలు కూడా పంపిణీ చేస్తామని భరోసా ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల చొప్పున స్థలాన్ని కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2.20 లక్షల కుటుంబాలకు సొంత జాగా లేదని గుర్తించామన్నారు.

**అక్రమార్కులపై ఉక్కుపాదం**

గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ రంగం, ఇసుక విధానాల్లో జరిగిన అవినీతిపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పేదల ఇళ్ల పేరుతో గత పాలకులు భారీగా అక్రమాలకు పాల్పడ్డారని, ఇసుక విధానాన్ని అస్తవ్యస్తం చేసి దోచుకున్నారని ఆరోపించారు. ఈ కుంభకోణాల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, త్వరలోనే దీనికి సంబంధించిన కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అందరికీ ఇళ్లు ఇచ్చే బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తాయని తెలిపారు.

**వ్యవసాయానికి 'పంచ సూత్రాల' ఊతం**

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం 'పంచ సూత్రాల' విధానాన్ని అమలు చేస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. అగ్రిటెక్, నీటి భద్రత, డిమాండ్ ఉన్న పంటల సాగు, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం ద్వారా రైతులను ఆదుకుంటామని చెప్పారు. వ్యవసాయంలో యాంత్రీకరణతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సేవలను కూడా రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామని సీఎం గుర్తుచేశారు. ఇందులో రాష్ట్ర వాటాగా రూ.14,000, కేంద్రం వాటాగా రూ.6,000 కలుపుకుని పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే 47 లక్షల మంది రైతులకు రెండు విడతల్లో రూ.6,309 కోట్లు జమ చేశామని, గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1,670 కోట్లు కూడా తామే చెల్లించామని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని, ఇప్పటివరకు రూ.10,816 కోట్లు చెల్లించామని వివరించారు. ఉచిత విద్యుత్ కోసం 2025-26 బడ్జెట్‌లో రూ.13,722 కోట్లు కేటాయించామని, ఈ ఏడాది కొత్తగా 69 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామని చెప్పారు.

**రాయలసీమ ఇక ఉద్యాన హబ్**

రాష్ట్రంలో ఉద్యానవన, ఆక్వా రంగాల అభివృద్ధికి భారీ ప్రణాళికలు రూపొందించామని చంద్రబాబు తెలిపారు. రాయలసీమను 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దేందుకు రూ.30 వేల కోట్లతో క్లస్టర్ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రైవేటు పెట్టుబడులతో కలిపి మొత్తం రూ.1 లక్ష కోట్లతో సీమ రూపురేఖలు మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం 400 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉన్న ఉత్పత్తులను 1000 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచడమే లక్ష్యమన్నారు. అలాగే, ఏలూరులో ప్రపంచంలోనే అతిపెద్ద 'కోకో సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం సంచలన ప్రకటన చేశారు. నీటి భద్రతపై తీసుకున్న చర్యల వల్ల అన్నమయ్య జిల్లాలో భూగర్భ జలాలు 6.67 మీటర్ల మేర పెరిగాయని, రాష్ట్ర సగటున 7.31 మీటర్ల మేర భూగర్భ జలాలు ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. దీనివల్ల రూ.95 కోట్ల విలువైన విద్యుత్ ఆదా అయ్యిందని చెప్పారు. కౌలు రైతులకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని, సాగునీటి సంఘాలను బలోపేతం చేసి రైతన్నకు భరోసా కల్పిస్తామని సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

# 18 ఏళ్లు న్యాయపోరాటం చేశాం

కుమార్తెను దారుణంగా హత్య చేశారు. 18 ఏళ్ల పాటు న్యాయపోరాటం చేశాం. రీపోస్ట్ మార్టం చేయాలంటూ సీబీఐ అధికారులు శరీర భాగాలు తీసుకున్నారు. హంతకులెవరో పోలీసులు, సీబీఐ అధికారులు తేల్చలేకపోయారు. మాకు న్యాయం జరగలేదు అంటూ ఆయేషా మీరా తల్లిదండ్రులు కన్నీరు పెట్టారు. ఆ అవశేషాలు తీసుకునేందుకు ఏడేళ్లు పోరాటం చేశామన్నారు. ఆయేషా మీరా అవశేషాలు విజయవాడ సీబీఐ కోర్టు నుంచి తీసుకున్నారు. తన కుమార్తెను చంపిన నిందితుడ్ని పట్టుకోవాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ ఆయేషా మీరా తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నేతలు కోర్టు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు . అనంతరం శరీర భాగాలను ఖననం చేసేందుకు తెనాలి వెళ్లారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమార్తెను కర్కశంగా కడతేర్చారు. 18 ఏళ్ల పాటు న్యాయ కోసం పోరాటం చేశాం. అయినా మాకు న్యాయం జరగలేదు. ప్రజాస్వామ్యంలో పేదలకు న్యాయం జరగదా ? అంటూ ఆయేషా మీరా తల్లి శంషాద్ బేగం ప్రశ్నించారు. ఆయేషా హత్య కేసును విచారణ చేసిన పోలీసులు, సిట్, సీబీఐ అధికారులు అసలైన హంతకుడ్ని పట్టుకోలేకపోయారని ఆరోపించారు. నిందితుడ్ని పట్టుకునేందుకు రీపోస్ట్ మార్టం చేయాలని ఆయేషా శరీర భాగాలను తీసుకున్న సీబీఐ అధికారులు వాటిని తిరిగి తీసుకునేందుకు సైతం ఏడేళ్లు పోరాటం చేయాల్సి వచ్చిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సీబీఐ కోర్టు ఆదేశాలతో అయేషామీరా అవశేషాలను తల్లిదండ్రులకు అధికారులు అప్పగించారు. శరీర భాగాలను తీసుకుని ఆయేషా మీరా తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నేతలు కోర్టు నుంచి బందర్ రోడ్?లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. న్యాయం కోసం తాము తిరుగుతుంటే, దోషులు మాత్రం దర్జాగా జల్సాలు చేస్తున్నారని ఆయేషా తల్లి ఆరోపించారు. ఆ దేవుడే దోషులను కఠినంగా శిక్షించాలని వేడుకుంటున్నాని తెలిపారు. సీబీఐ అధికారులు ఆధారాలు లేవని చెబుతున్నారని, ధనికులకు మాత్రమే న్యాయం జరుగుతోందని ఆక్షేపించారు. ఎఫ్?ఐఆర్?లో వయస్సు కూడా తప్పుగా నమోదు చేశారని ఆరోపించారు. తన కుమార్తె కేసును పోలీసు అధికారులు తొక్కిపెట్టారని ఆరోపించారు. ఆయేషా మీరాను 2007 డిసెంబరు 27న రాత్రి ఇబ్రహీంపట్నంలోని మహిళల వసతి గృహంలో కర్కశంగా హత్య చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు మొదట పనివాడని, ఆ తర్వాత లడ్డూ అనే వ్యక్తి పేరును తెరపైకి తెచ్చారు. అనంతరం సత్యంబాబు నిందితుడని తేల్చారు. మొదటి నుంచి కేసు దర్యాప్తు విషయంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారని ప్రజాసంఘాలు మండిపడ్డాయి. కేసు ఆధారాలు సేకరించటం, ఉన్న ఆధారాలను భద్రపరచటంలో సైతం నిర్లక్ష్యం వహించారని ఆయేషా తల్లి ఆరోపించారు. విజయవాడలోని మహిళా సెషన్స్ కోర్టు సత్యంబాబును దోషిగా తేల్చి శిక్ష ఖరారు చేసింది. కానీ ఈ కేసును 2017లో హైకోర్టు కొట్టేసి సత్యం బాబును నిర్దోషిగా విడుదల చేసింది. కేసును తిరిగి విచారించాలని, అసలు నేరస్తులను పట్టుకోవాలని ఆయేషా మీరా తల్లి అప్పట్లో హైకోర్టులో పిటిషన్ వేశారు. అనంతరం ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. 11 నెలల పాటు దర్యాప్తు చేసిన సిట్ దిగువ కోర్టులో కేసుకు సంబంధించిన ఆధారాలు ధ్వంసమయ్యాయని హైకోర్టుకు తెలిపింది. ఈ నేపథ్యంలో దర్యాప్తును 2019లో సీబీఐకి హైకోర్టు బదిలీ చేసింది. మూడు దర్యాప్తు సంస్థలు విచారణ చేసినా ఆయేషా మీరా హంతకుడ్ని మాత్రం పట్టుకోలేకపోయారని ప్రజా సంఘాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి . ప్రభుత్వం ఆయేషా మీరా తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరుతున్నారు

# 'ఇంకెంతమంది ప్రాణాలు పోవాలి'

ఆంధ్రప్రదేశ్‌లో పాలు, నీళ్లు కల్తీపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకెంతమంది ప్రాణాలు పోవాలంటూ చంద్రబాబు సర్కార్‌ను ప్రశ్నించారు. "ఎవరైనా బతకడం కోసం పాలు, నీళ్లు తాగుతారు. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఆ రెండూ ప్రాణాంతకం అవుతున్నాయి. పలు చోట్ల కల్తీ పాలు, కలుషిత నీరు తాగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు" అంటూ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. "ప్రతి ఒక్కరి జీవితంలో అత్యవసరమైన ఆ రెండింటి పేరు వింటేనే ఉలిక్కిపడే పరిస్థితి రాష్ట్రంలో ఉత్పన్నమైంది. టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు పాలనలో డయేరియా, ఫుడ్ పాయిజన్ ఘటనలు తరుచూ వెలుగు చూస్తున్నాయి. రాష్ట్రంలో కుప్పకూలిన ప్రజారోగ్య వ్యవస్థకు ఆ ఘటనలు అద్దం పడుతున్నాయి. పరిపాలనపై చంద్రబాబు పూర్తిగా తన పట్టు కోల్పోగా, మిగిలిన వారంతా ప్రతిపక్షంపై బురద చల్లడం, నిత్యం అసత్య ప్రచారం చేయడంతో పాటు, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఎక్కడికక్కడ స్వార్థ ప్రయోజనాలు ఆశించి పని చేస్తూ.. ప్రజారోగ్యం, వారి రక్షణ వంటి వాటికి పూర్తిగా మంగళం పాడుతున్నారు" అని వైఎస్ జగన్ మండిపడ్డారు. "కురుపాం గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో 16 మంది విద్యార్థినులు డయేరియాతో అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఐదుగురిని ఆస్పత్రికి తరలించారు. ఇదే పాఠశాలలో గతంలో కలుషిత నీటి కారణంగా పచ్చకామెర్లతో ఇద్దరు బాలికలు మృతి చెందగా, దాదాపు 100 మంది విద్యార్థినులు ఆస్పత్రి పాలయ్యారు. అంత దారుణంగా ఘటనలు చోటు చేసుకున్నా, సమస్య శాశ్వత పరిష్కార దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అప్పుడు ఆ విధంగా వ్యవస్థ దారుణంగా విఫలం కాగా, మళ్లీ ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉత్పన్నమైంది. ..టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, గత 14 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్లు, విద్యాసంస్థల్లో ఫుడ్ పాయిజన్, కలుషిత నీరు, ఆహారం, అపరిశుభ్రత వల్ల వ్యాధుల వంటి ఘటనలు దాదాపు 25 చోటు చేసుకున్నాయి. వాటి వల్ల 15 జిల్లాల్లో 900 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇదే విషయాన్ని జాతీయ మీడియా సైతం ప్రముఖంగా ప్రచురించింది. పూర్తిగా కొరవడిన పరిశుభ్రత, కలుషిత నీరు, ఆహారం, హాస్టళ్లలో దారుణ పరిస్థితులను జాతీయ మీడియా కూడా ఎండగట్టింది. ..రాష్ట్రంలో గడచిన 18 నెలల్లో చేబ్రోలు, విజయవాడ, గుంటూరు, గుర్ల, శ్రీకాకుళం, తురకపాలెం ప్రాంతాల్లో పెద్దఎత్తున డయేరియా ప్రబలింది. ఫలితంగా వందలాది మంది అస్వస్థతకు గురయ్యారు. డజన్ల కొద్దీ మరణాలు సంభవించాయి. ముఖ్యంగా కలుషిత నీరు, అపరిశుభ్రత అందుకు ప్రధాన కారణాలు. అయితే ఇదేమీ ఆషామాషీ వ్యవహారం, లెక్కలు కావు. ప్రభుత్వ నిర్లక్ష్యం, హాస్టళ్లపై పూర్తిగా కొరవడిన పర్యవేక్షణ, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టవలసిన చర్యల్లో వైఫల్యానికి అద్దం పడుతున్నాయి. ..గత వారం పరిస్థితి మరింత దారుణంగా మారింది. శ్రీకాకుళంలో కలుషిత నీటి కారణంగా తీవ్ర డయేరియా వ్యాప్తి చెందింది. ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 200 మంది ఆస్పత్రుల పాలయ్యారు. అతిసారం, ఇన్ఫెక్షన్లతో పలు కుటుంబాలు తల్లడిల్లాయి. ఎప్పటికప్పుడు నీటి నాణ్యత పరీక్ష, సురక్షిత నీటి సరఫరా కోసం తగిన మౌలిక వసతుల కల్పన, నిర్వహణ, ఇలాంటి దురదృష్టకర ఘటనలు చోటు చేసుకున్నప్పుడు వేగంగా స్పందించి, నష్ట నివారణ చర్యలు తీసుకోవడంలో.. వైఫల్యాన్ని స్పష్టంగా చూపాయి. అదే వారం రాజమహేంద్రవరం నగరంలో కల్తీ పాల కారణంగా మరో విషాదం చోటుచేసుకుంది. ఏకంగా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఎనిమిది మంది ప్రాణాపాయ స్థితిలో వివిధ ఆస్పత్రుల్లో వెంటిలేటర్లపై చికిత్స పొందుతున్నారు. ఇంకా మరెందరో అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలయ్యారు. పోషణ ఇవ్వాల్సిన పాలు చివరకు మరణానికి కారణమయ్యాయి. ఇది ఏదో ఒక చిన్నపాటి లోపం కాదు. ఆహార భద్రత పర్యవేక్షణలో నిర్లక్ష్యం, దానికి సంబంధించిన యంత్రాంగాల వైఫల్యాన్ని స్పష్టంగా చూపుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం నిద్ర లేచి నిజాయితీగా పరిస్థితిని సమీక్షించాలి. ఎక్కడెక్కడ లోపాలున్నాయో గుర్తించాలి. వాటన్నింటినీ సరి చేయాలి. వాటి ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలన్న ఆలోచన వీడాలి. సురక్షిత నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. ఆహార భద్రత పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. పరిశుభ్రత ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలి. వీటన్నింటిపై చిత్తశుద్ధితో పని చేయాలి. ప్రభుత్వం నుంచి ప్రజలు ఏవో అద్భుతాలు కోరుకోవడం లేదు. ఇంకా మరిన్ని ప్రాణాలు పోకముందే ప్రభుత్వం మేల్కొని, తగిన చర్యలు చేపట్టాలని మాత్రమే ప్రజలంతా ఆశిస్తున్నారు" అంటూ వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

# ఇక కోర్ అర్బన్ చట్టం

అనుమ తులు, రుసుములు, అభివృద్ధి పనుల నిర్వహణ, ఇతర వ్యవహారాలన్నింటికీ ఆ చట్టమే ఆధారంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 99 రోజుల కార్యక్రమంలో మున్సిపల్ పరిధిలో చేపట్టే పనులు తొలుత చేపడతామని సీఎం తెలిపారు. పురపాలక, పట్టణాభివృద్ధిశాఖపై రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కోర్ అర్బన్ ఏరి యాలో పారిశుధ్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పలు ప్రాంతాల్లో చెత్త ఎక్కడ వేయాలో తెలి యక ప్రజలు ఖాళీ ప్రదేశాల్లో వేస్తున్నారని, ముందుగా చెత్త వేయాల్సిన ప్రాంతాలను గుర్తించి అక్కడ బోర్డులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం పేర్కొన్నారు.

**రోడ్ల నిర్మాణంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి**

కోర్ అర్బన్ ఏరియాలో రోడ్ల నిర్మాణ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఎం తెలిపారు. రోడ్డు నిర్మించిన తర్వాత దాని జీవిత కాలం ఎంతనేది నిర్ణయించి, ఆ లోపు దానిని తొలగించినా అక్కడ మళ్లీ రోడ్డు వేసినా అందుకు బాధ్యులు ఎవరో తేల్చాలని సీఎం ఆదేశించారు. కోర్ అర్బన్ ఏరియాలో ప్రతి వీధి దీపం వెలుగుతుందో లేదో డ్యాష్ బోర్డులో కనిపించాలని సీఎం అన్నారు. అలాగే ఫుడ్ సేఫ్టీకి ఎక్కువ ప్రాధాన్యమివ్వాలని సీఎం సూచించారు. నగరంలోని అన్ని హోటళ్లలోని కిచెన్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. ఫైర్ సేఫ్టీకి పెద్ద పీట వేయాలని, నగరంలోని సర్కిల్స్‌లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టాలని సూచించారు ఆర్ అండ్ బీ, ఇతర విభాగాల పరిధిలోని రోడ్లన్నింటినీ ఎంఏయూడీ(మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్)పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. నగరంలో వివిధ ప్రదేశాల్లో రద్దీ తగ్గించేందుకు డిజైన్ చేసిన ఎలివేటెడ్ కారిడార్ల నమూనాలను అధికారులు ప్రదర్శించారు. వాటిని పరిశీలించిన సీఎం పలు సూచనలు చేశారు. చారిత్రక ప్రాధాన్యం గల కట్టడాలను పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు.

**భవనాల పనులు వేగవంతం చేయాలి**

భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని , అక్కడ అవసరమైన అనుమతులు వెంటనే తీసుకోవాలని సూచించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల భవనాల పనులు వేగవంతం చేయాలని సీఎం సూచించారు. నిర్మాణాల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలన్నారు. హైడ్రా పరిరక్షించిన చెరువుల చుట్టూ కట్టలు కట్టి వదిలి వేయకుండా వాటి రక్షణతోపాటు సుందరీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, ఎంఏయూడీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఇ.వి.నరసింహారెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనర్లు కర్ణన్, జి.సృజన, వినయ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టు రహిత రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణ

ఆ తర్వాత మరో దశకంలో కొండపల్లి సీతారామయ్య నేతృత్వంలోని పీపుల్స్?వార్ గ్రూప్ ఈ ప్రాంతాన్ని తన కంచుకోటగా మార్చుకుంది. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలు విప్లవ భావజాలానికి కేంద్ర బిందువులయ్యాయి. వేలాది మంది యువత అడవి బాట పట్టి, సాయుధ పోరాటమే సమస్యలకు పరిష్కారమని నమ్మారు. అప్పటి నుంచి తాజా పరిణామాల వరకు ఓసారి మావోయిస్టు ఉద్యమ చరిత్రను పరిశీలిద్దాం.

**అడవులు, కొండలను కంచుకోటగా మార్చుకుని :** మావోయిస్టులు ఒకానొక దశలో ఉమ్మడి రాష్ట్రంలో పలు గ్రామాల్లో 'జనతన సర్కార్' పేరుతో సమాంతర ప్రభుత్వాలను నడిపారని గతంలోనే పోలీస్ అధికారులు గుర్తించారు. భూ పంపిణీ, గిరిజన సమస్యల పరిష్కారం లాంటి అంశాలతో ప్రజల్లో పట్టు సాధించారు. పోలీస్ నిఘా ఉన్నప్పటికీ, దట్టమైన అడవులు, కొండలు మావోయిస్టులకు రక్షణ కవచాలుగా మార్చుకున్నారు. దీంతో పోరాటంతోనే అన్ని రకాల సదుపాయాలు వస్తాయినే భావనను అదివాసులు, ప్రజల్లో మావోయిస్టు పార్టీ అగ్ర నేతలు కల్పించారు. మావోలు ప్రధానంగా భూ సంస్కరణలు, గిరిజన హక్కులు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం, అడవుల్లో పోలీసుల కూంబింగ్ నిలిపివేత తదితర అంశాలపై అప్పటి వైఎస్సార్ ప్రభుత్వంలో చర్చలు జరిగాయి. మొదటి విడత చర్చలు జరిగాక, భూ సంస్కరణల వంటి అంశాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడం, పరస్పర దాడుల నేపథ్యంలో ఈ చర్చలు విఫలమయ్యాయి.

**ఆపరేషన్ కగార్‌తో చెల్లాచెదురైన మావోలు :** 2005 జనవరి నాటికి చర్చల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. మావోయిస్టులు తిరిగి అడవుల్లోకి వెళ్లిపోయారు. వైఎస్ఆర్ ప్రభుత్వం మావోయిస్టులపై మళ్లీ నిషేధాన్ని విధించింది. పోలీసులు మునుపెన్నడూ లేనంత తీవ్రంగా కూంబింగ్ నిర్వహించారు. 2005 సెప్టెంబర్‌లో మావోయిస్టు నేత ఆర్కేపై దాడి జరగగా, చిట్టాల ఎన్‌కౌంటర్ నుంచి ఆయన త్రుటిలో తప్పించుకున్నారు. అదే సమయంలో కీలక నేతలు చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గ్రేహౌండ్స్ దళాల గాలింపు చర్యలను తక్షణమే నిలిపివేయాలని కూడా కోరారు. 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, ప్రభుత్వం మావోయిస్టుల ప్రభావాన్ని తగ్గించడానికి రెండు పద్ధతులతో చర్యలను చేపట్టింది.

ప్రపంచంలోనే అత్యుత్తమ అటవీ యుద్ధ తంత్రం తెలిసిన గ్రేహౌండ్స్ దళాలను బలోపేతం చేయడం ద్వారా మావోయిస్టుల షెల్టర్లను, రిక్రూట్‌మెంట్‌ను దెబ్బకొట్టారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో బలమైన చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రాకపోకలను అడ్డుకున్నారు. కేవలం బల ప్రయోగంతోనే కాకుండా, ప్రజల కనీస అవసరాలు తీర్చడం ద్వారా వారు మావోయిస్టులకు దూరం అవుతారని అధికారులు భావించారు. అప్పటి నుంచి ప్రతి గ్రామంలో ఇంటికి తాగునీరు అందజేశారు. అట్టడుగు వర్గాలకు ఆర్థిక భరోసాను ప్రభుత్వం ఇచ్చింది. లోతట్టు గ్రామాలకు తారు రోడ్లు వేయడం ద్వారా గిరిజనులను ప్రధాన స్రవంతికి దగ్గర చేసింది. దీంతో పోలీసుల గస్తీ కూడా సులభమైంది. అలాగే కేంద్ర ప్రభుత్వం అపరేషన్ కగార్ పేరుతో మావోయిస్ట్ పార్టీని పూర్తిగా నిర్మూలించాలని భావించింది.

**వనం వీడి జనంలోకి :** ప్రస్తుతం తెలంగాణలోని మెజారిటీ జిల్లాల్లో మావోయిస్టుల ఉనికి లేకుండా పోయింది. మావోయిస్టు పార్టీకి అత్యంత బలమైన పునాదులు వేసిన నేతలే ఇప్పుడు ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలోకి రావడం విశేషం. ఆ పార్టీ పొలిట్?బ్యూరో సభ్యుడు, సెంట్రల్ మిలిటరీ కమిషన్? ఇన్?ఛార్జి దేవ్?జీ, సెంట్రల్ కమిటీ సభ్యుడు రాజిరెడ్డి, రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు (దామోదర్), కీలక నేత నూనె నర్సింహా రెడ్డి లొంగిపోవడంతో రాష్ట్రంలో మావోయిస్టులకు దిశానిర్దేశం చేసే నాయకత్వం కనుమరుగైందని పోలీసులు చెబుతున్నారు.

# తెలంగాణ ఉద్యోగులకు 'భారీ' ఊరట..!

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రూ. 745 కోట్ల నిధులను విడుదల చేస్తూ ప్రభుత్వం ఈ రోజు ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థిక శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకుని బకాయిల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అధికారులు చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేశారు.

**హామీ నెరవేర్చిన సర్కార్**

ఉద్యోగ సంఘాలతో గతంలో జరిపిన చర్చల సందర్భంగా.. పెండింగ్ బకాయిలను విడతల వారీగా క్లియర్ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం మొదటి విడతలో భాగంగా ఈ భారీ మొత్తాన్ని కేటాయించింది. జీతాలు, పెన్షన్లు మరియు ఇతర అలవెన్సుల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఈ నిర్ణయంతో పెద్ద ఉపశమనం లభించినట్లయింది.

**పంచాయతీలకూ నిధుల పంపిణీ**

స్థానిక సంస్థల బలోపేతానికి కూడా ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు రూ.389 కోట్ల నిధులను విడుదల చేసింది. దీనివల్ల గ్రామాల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ మరియు ఇతర అత్యవసర పనులకు మార్గం సుగమం కానుంది.

# శ్రీరామరక్ష



గుడిసెలో జీవిస్తున్నావని
నిన్ను నువ్వు తక్కువ చేసుకోకు
ఆత్మాభిమానంతో బ్రతుకుతూ
నలుగురు క్షేమం కోరుకునే
నీలాంటి వాళ్ళే సమాజానికి
అవసరం.

గుడిలో పెట్టే ప్రసాదంలో
కొంచం చక్కర తక్కువైతే
అది ప్రసాదం అనుకుంటూ
ఏమి పర్వాలేదులే అనుకొని
ఎలా ఉన్నా సరే నవ్వుకుంటూ
పడేయకుండా తినేస్తాం!

భగవంతుడిచ్చిన జీవితంలో
కొన్ని రోజులు బాగాలేవని
నిన్ను నువ్వే శిక్షించుకోకూడదు
అలాంటప్పుడే ధైర్యంగా ఉండాలి
ఎటువంటి తప్పుడు నిర్ణయాలు
తీసుకోకూడదు మిత్రమా!

ఏమి పరవాలేదంటూ
జీవితంలో ముందుకెళ్ళాలి
అదే నీకు శ్రీరామరక్ష
జరగబోయే రోజుల్లో నీకు
బంగారం లాంటి భవిష్యత్తుఉ
ంది.

**రచన : కె.మురళీమోహన్ రాజు**
**నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

## కమిషనర్ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణ చేసిన కమిషనర్



**నెల్లూరు సిటీ.. (విజ్ఞాన్ ప్రతినిధి )..**

భాగంగా స్థానిక 51, 52 డివిజన్లలోని రంగనాయకులపేట, సంతపేట మధ్యలో జరుగుతున్న ఎండ్ టు ఎండ్ సి.సి రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. రోడ్డు నిర్మాణ పనులతో పాటు డ్రైను కాలువలను అనుసంధానించే క్రమంలో నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా కాంట్రాక్టర్లు పాటించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. డ్రైను కాలువలపై ఎలాంటి మెట్లు, ర్యాంపులు, ఇతర నిర్మాణాలు, దుకాణాలు ఏర్పాటు చేయకుండా పర్యవేక్షించాలని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కప్పిర శ్రీనివాసులు, నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ. రహంతు జానీ, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు...

## పవన్ కళ్యాణ్ ఆశయాలలో ఒకటైన జనసేన పార్టీ 2026 సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతం



**నెల్లూరు.. ఫిబ్రవరి.. (విజ్ఞాన్ ప్రతినిధి )...**

నెల్లూరు జిల్లా గోమతి నగర్‌లోని జనసేన పార్టీ జనసేన పార్టీ కార్యాలయంలో 2026 సంవత్సరానికి సంబంధించిన సభ్యత్వ నమోదు కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జిగా విచ్చేసిన బొలిశెట్టి శ్రీనివాస్ ని ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ మరియు జిల్లా సీనియర్ నాయకులు లిలినూనె మల్లికార్జున యాదవ్,పూలమాలలు వేసి ఫ్రూట్ బొకే ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన బొలిశెట్టి శ్రీనివాస్ గత సంవత్సరం నెల్లూరు జిల్లాలో 36 వేల సభ్యత్వాలు నమోదు చేసిన ఘనతలిలిను గుర్తుచేస్తూ, ఈసారి మరింత ఉత్సాహంతో లక్ష సభ్యత్వాల లక్ష్యాన్ని చేరుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసిన జిల్లాగా నిలిచిన నెల్లూరు, ఈసారి కూడా అదే రికార్డును తిరగరాయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు మరియు సభ్యత్వం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి వివరించారు.

# వి బి జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలి

**- బి కే యం యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్**

**నెల్లూరు:ఫిబ్రవరి.27/(విజ్ఞాన్ ప్రతి నిది )..**

మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి.విబి జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలి, జిల్లాలో ఉపాధి హామీ పనుల్లో, వెలుగు డిపార్ట్మెంట్లో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని మార్చి ఒకటి నుంచి 15వ తేదీ వరకు మార్చి 16వ తేదీన కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నెల్లూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని రామకోటయ్య భవన్లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి లీలామోహన్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది . ఈ సమావేశంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొని తమ అమూ ల్యమైన సలహాలు సూచనలు ఇవ్వడంతో పాటు భవిష్యత్ కార్యాచరణకు తగు సూచనలు ఇవ్వడం జరిగింది ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం 2005లో 62 మంది వామపక్ష ఎంపీల ప్రోత్బలంతో ఈ చట్టాన్ని తీసుకురావడం జరిగిందని దేశంలో అనేక రాష్ట్రాలు ప్రత్యేకించి మన రాష్ట్రంలో అనంతపురం జిల్లా అత్యంత కరువు జిల్లాగా దేశంలోని పేరుగాంచిన సందర్భంగా అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఇక్కడ ఈ పథకాన్ని మొదటగా ప్రారంభించడం జరిగిందని అప్పటినుంచి ఉపాధి హామీ చట్టం గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు సంజీవినిగా ఉన్నదని దీనిని రద్దు చేస్తూ పార్లమెంట్లో ఎంపీల ప్రమేయం లేకుండా మూజువాణి ఓటుతో కొత్త చట్టాన్ని విబి జీ రామ్ జీ అనే కొత్త చట్టం తేవడం జరిగిందని దీనిలో అనేక లొసుగులు తో పాటు పేద ప్రజలకు తీవ్ర అన్యాయం చేసే కుట్ర దాగి ఉందని అన్నారు గతంలో కేంద్రం 90 శాతం రాష్ట్రాలకు 10 శాతం నిధులు కేటాయిస్తుండగా దానిని కొత్త



చట్టం లో కేంద్రం 60 శాతం రాష్ట్రాల 40 శాతంగా నిధులు సమకూర్చుకోవాలని చెప్పడం అంటే కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఉపయోగపడే ఈ చట్టాన్ని నీరుగార్చడమేనని దీని తీవ్రంగా వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని భవిష్యత్తులో కూడా కొత్త చట్టాన్ని రద్దుచేసి పాత చట్టాన్ని కొనసాగించే విధంగా ఆందోళన నిర్వహించాలని పిలుపునిచ్చారు అదేవిధంగా 200 రోజులు పని దినాలు కల్పించడంతోపాటు రోజుకు 700 రూపాయలు కూలి వచ్చే విధంగా పనులు కల్పించాలని డిమాండ్ చేశారు అదేవిధంగా పనిచేసే దగ్గర అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని మజ్జిగ త్రాగునీరు తప్పకుండా ఏర్పాటు చేయాలని కోరారు పనిచేసే క్రమంలో ఉపాధి కూలీకి ఏమైనా ప్రమాదం జరిగితే పది లక్షల బీమా ప్రభుత్వమే ఇచ్చే విధంగా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మన జిల్లాలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతిపైన సమగ్రమైన సమాచారాన్ని సేకరించి అవినీతి చేసిన అధికారుల పైన ఎటువంటి చర్యలు తీసుకున్నారు సామాజిక తనిఖీలు పేర్కొనబడిన విధంగా మింగేసిన సొమ్మును ఎంతవరకు రికవరీ చేశారు తెలుసుకోవాలని తద్వారా మనము సమగ్రమైన కార్యక్రమాన్ని తీసుకోవచ్చని కోరారు చాలా మండలాల్లో లక్షల నుంచి కోట్ల వరకు అవినీతి జరిగిందని పేదలకు దక్కాల్సిన విషయము అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లు టెక్నికల్ సిబ్బంది కుమ్మక్కై దిగమింగుతున్నారని దీన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత మనల్ని పేదలకు దక్కాల్సిన సొమ్ము వారికే దక్కే విధంగా ప్రత్యేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు అంతేకాకుండా వెలుగు పథకంలో జరుగుతున్న దారుణమైన మోసాలను పొదుపు సభ్యులకు వివరించి బాధిత మహిళలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాడి వారికి జరిగిన అన్యాయాన్ని తీవ్రంగా పరిగణించి వారికి న్యాయం చేసే విధంగా పోరాడాలని పిలుపునిచ్చారు అందులో భాగంగానే ఈ రెండు డిపార్ట్మెంట్లలో జరిగే అవినీతిపైన సమర శంఖం పూరించే విధంగా మార్చి ఒకటి నుంచి 15వ తేదీ వరకు వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి మార్చి 16వ తేదీన కలెక్టర్ ఆఫీస్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి మన నిరసన తెలియజేయడంతో పాటు ఆ రెండు డిపార్ట్మెంట్లో జరుగుతున్న అవినీతిని అరికట్టే విధంగా జిల్లా అధికారుల కళ్ళు తెరిపించే విధంగా మన కార్యక్రమం ఉండాలని విజ్ఞప్తి చేశారు పై కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ ప్రభాకర్ జిల్లా ప్రధాన కార్యదర్శి నంది పోగు రమణయ్య ఉపాధ్యక్షులు దందూరి కామేశ్వరరావు, చిల్లకూరు మండలం వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి శ్రీనివాసమూర్తి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యామాల మధు నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జిలాని ఖాన్, మహిళా సమాఖ్య జిల్లా కో కన్వీనర్ శిరీష నగర అధ్యక్షురాలు వి వనజ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ శాన్వాజ్, ప్రజానాట్యమన జిల్లా కార్యదర్శి తల్లు సీనయ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ గూడూరు నియోజకవర్గ సిపిఐ నాయకులు యాదాల సునీల్, రమేష్ మాజీ డివిఎంసి సభ్యులు కొప్పోలు రఘు , ఆల్ ఇండియా గ్రామీణ రిటైర్డ్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు దుడ్డు రమేష్ బాబు,ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కన్వీనర్ నరసింహారావు, సిపిఐ కోవూరు నియోజకవర్గ కార్యదర్శిబొమ్మివిజయకుమార్ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కోవూరు శాఖ అధ్యక్ష కార్యదర్శులుసుమతి మాధవితదితరులుపాల్గొన్నారు.

## తిరుమల లడ్డుపై చర్చ జరగాలంటూ.. శాసనమండలిలో.. వైఎస్ఆర్సిపి సభ్యులు నిరసన..

**నెల్లూరు సిటీ.... ఫిబ్రవరి. 27/(విజ్ఞాన్ ప్రతినిధి )...**



ఏపీ అమరావతి శాసనమండలి సమావేశాల్లో.. తిరుమల లడ్డులో కల్తీ నెయ్యి వినియోగంపై.. చర్చ జరగాలంటూ.. శాసన మండలిలో ... శాసన మండలి సభ్యులతో కలిసి..ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ..బైఠాయించి నిరసన తెలియజేశారు. తిరుమల లడ్డుపై వైఎస్ఆర్సిపి చర్చకు.. ప్రతిపాదిస్తుంటే ప్రభుత్వం.. దొంగలాగా పారిపోవడం.. సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ఈరోజు అన్ని ఆధారాలతో వైఎస్ఆర్సిపి చర్చకు సిద్ధమైతే.. అసలు నిజాలు ప్రజలకు ఎక్కడ తెలుస్తాయో అన్న .. భయంతోనే.. ప్రభుత్వం చర్చకు వెనుకడుగు వేస్తుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం చర్చకు అనుమతించే వరకు తమ పోరాటం ఆగదని వైఎస్ఆర్సిపి సభ్యులు తెలియజేశారు.

## బ్లూ జెట్ గ్రౌండ్ బ్రేకింగ్ కార్యక్రమం

**- ఉన్నతాధికారుల బందోబస్తు పరిశీలన రాంబిల్లి పోలీసు వారు**





**విజ్ఞాన పత్రిక రాంబిల్లి రిపోర్టర్**

కోటిని బాబురావు, రాంబిల్లి మండలంలోని బ్లూ జెట్ కంపెనీ ప్రాంగణంలో ఈ నెల 28వ తేదీన గౌరవ మంత్రి ఛీఖీఖీ ాశీనివంష్త్ర గారి చేతుల మీదుగా నిర్వహించనున్న గ్రౌండ్ బ్రేకింగ్ కార్యక్రమం నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను ఉన్నతాధికారులు సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ (అడ్మిన్) దేవప్రసాద్ గారు మరియు పరవాడ డీఎస్పీ వీశీష్త్రుఖుఖీఖీశీ గారు కార్యక్రమ స్థలాన్ని సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. పార్కింగ్ వ్యవస్థ, ట్రాఫిక్ నియంత్రణ, వీఐపీ మార్గాలు, వేదిక భద్రత, ప్రజల రాకపోకలు వంటి అంశాలపై నిర్వాహకులతో చర్చించారు. కార్యక్రమానికి ఎ×ూ హాజరయ్యే అవకాశం ఉన్నందున, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట్ల బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, ప్రత్యేక పోలీసు సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. కార్యక్రమం సాఫీగా, విజయవంతంగా జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

# విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి

**- విశ్రాంతి వసతి అధికారి భాష ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్ష పై అవగాహన సదస్సు**

**- కావలి ప్రభుత్వ బి.సి వసతిగృహముల లోని10వతరగతి, విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష సామాగ్రీ వితరణ**

**కావలి విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్( సివిఆర్)**

శ్రీసాయి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, వి మాధవిఆధ్వర్యంలోమనసున్న దాతల సహకారంతోకావలి డివిజన్ సహాయ బిసి సంక్షేమాధికారిశ్రీమతి అరుణమ్మ అధ్యక్షతన.... ప్రభుత్వబిసి బాలికల హాస్టల్ లోని 45మంది, బిసి బాలుర హాస్టల్ లోని 25మందికి, త్వరలోజరుగబోవు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సంధర్భముగ, హర్ష ధ్వనులమధ్యన పరీక్షసామాగ్రి అందచేయడంజరిగింది. గౌరవ అతిధులు గ విచ్చేసిన, విశ్రాంత లెక్చరర్ ప్రసాద్ రావు , విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, అజిత్ బాబు, విశ్రాంత వసతిగృహ సంక్షేమాధికారి, బాష విద్యార్థులకు ప్రేరణ,అవగాహన కార్యక్రమంలో భాగంగ, పరీక్షలలో విద్యార్థిని, విద్యార్థులకు,తగు సూచనలు, జాగ్రత్తలు, అవలంభించాల్సిన పద్ధతులుగురించి తెలియచేస్తు, మీరందరుఇష్టపడి, కస్టపడి చదివి భావి భారత పౌరులుగా అన్నిరంగాల్లో రాణించాలని, మీ ఉజ్వల భవిష్యత్ మీచేతుల్లో ఉన్నదని,ఉత్తిర్ణత శాతంను పెంచి,మంచి రాంకులు



సాధించాలని, మీతల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమాధికారులకుమంచిపేరు ప్రతిష్టలు,తేవాలని ధైర్యం నింపడమైనది, పై కార్యక్రమం లో వసతిగృహ సంక్షేమాధికారులు చలపతి రావు, నాగేశ్వరి,హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థినులు, పాల్గొన్నారు

## నేడు సిఎస్ గా పదవీ బాధ్యతలు స్వీకరించనున్న సాయి ప్రసాద్.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా జి.సాయి ప్రసాద్ శనివారం ఎపి సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. గత నవంబరు 29వ తేదీన జిఓఆర్టి సంఖ్య 2230 ద్వారా ప్రస్తుత సిఎస్ విజయానంద్ పదవీ కాలాన్ని మూడు మాసాలు ఈనెల 28వ తేదీ వరకూ పొడిగిస్తూ, తదుపరి సిఎస్ గా ప్రస్తుతం జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా మరియు ఇఓ స్పెషల్ సిఎస్ టు సియంగా ఉన్నసాయి ప్రసాద్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమేరకు శనివారం ఉ.11.33 గం.లకు ఎపి సచివాలయంలో సాయి ప్రసాద్ నూతన సిఎస్ గా పదవీ బాధ్యతలు చేపడతారు. 1991 ఐఏఎస్ బ్యాచ్ ఎపి క్యాడర్ కు చెందిన సాయి ప్రసాద్ ఎంటెక్ పట్టభద్రులు కాగా 1991 సెప్టెంబరు 15న ఐఏఎస్ కు ఎంపికై 1992 జూన్ నుండి 1993 మే వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వరంగల్ అసిస్టెంట్ కలెక్టర్ గా పని చేశారు. అనంతరం 1993 సెప్టెంబరు నుండి 1995 ఏప్రిల్ వరకు పాడేరు అసిస్టెంట్ కలక్టర్ గా,1995 ఆగస్టు నుండి 1997 మార్చి వరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ గా పని చేశారు. అనంతరం 1997 మే నుండి 1998 ఆగస్టు వరకు కడప జాయింట్ కలక్టర్ గా,2000 జూలై నుండి 2003 జూన్ వరకూ కర్నూల్ కలక్టర్ గా, 2003 జూన్ నుండి 2003 అక్టోబరు వరకు చిత్తూరు జిల్లా కలెక్టర్ గా పనిచేశారు. 2003 అక్టోబరు నుండి 2004 ఆగస్టు వరకు ఎపి ట్రాన్సుకో



జెఎండిగా,2004 ఆగస్టు నుండి 2006 మే వరకు ఇ వి డి వి సి ఎ ల్ సిఎండిగా,2006 మే నుండి 2010 ఫిబ్రవరి వరకు ఎపి సిపిడిసిఎల్ సిఎండిగా పని చేశారు. 2010 ఫిబ్రవరి నుండి 2011 అక్టోబరు వరకు ఎపి హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గా పని చేశారు. అనంతరం 2011 అక్టోబరు నుండి 2014 జూన్ వరకు కేంద్ర ప్రభుత్వ ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. తదుపరి 2014 జూన్ నుండి 2016 ఫిబ్రవరి వరకు సియం కార్యదర్శిగా,2016 ఫిబ్రవరి నుండి 2019 మే వరకు సియం ముఖ్య కార్యదర్శిగా పని చేశారు. తదుపరి 2020 జనవరి నుండి 2022 ఫిబ్రవరి వరకు ఎపి సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రవేట్ లిమిటెడ్ కు సిఎండి గాను మరియు ఇంధన శాఖ ఎక్స్ అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీగాను పని చేశారు. అనంతరం 2022 ఫిబ్రవరి నుండి 2024 జూన్ వరకు సిసిఎల్ఏగా పనిచేశారు. తదుపరి 2024 జూన్ నుండి 2025 జనవరి జలవరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ 2025 జనవరి నుండి అదే హోదాలో పనిచేస్తూ, సిఎం ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగాను పని చేస్తున్నసాయి ప్రసాద్ శనివారం నూతన సిఎస్ గా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు..

